క్లుప్తంగా

ఉమ్మలాడలో నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



ఉమ్మలాడలో నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : మండలంలోని ఉమ్మలాడలో గురువారం నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఉపసర్పంచ్ మందా రాము, వైఎస్సార్‌సీపీ నేత సూరిశెట్టి రామకృష్ణ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



మునగపాకలో బీటీ రోడ్డు పనులు

మునగపాక : పూడిమడక రోడ్డులో గురువారం బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దీంతో రాకపోకలు సాగించే వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న రహదారిని అభివృద్ధి చేయడంలో భాగంగా వీఎంఆర్‌డీఏ ద్వారా రూ.6.5 కోట్ల నిధులతో బీటీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం మునగపాకలోని ప్రణతి స్కూల్‌కు ఎదురుగా ఉన్న ప్రాంతం నుంచి పనులను సంబంధిత అధికారులు ప్రారంభించారు. ఈ రోడ్డు మార్గం గుండా రాకపోకలు సాగించేవారి నుంచి హర్షాతిరేకాలు వినిపిస్తున్నాయి. త్వరితగతిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

సీతారామ ఆలయంలో పందిరి రాట



శ్రీ సీతారామ ఆలయంలో పందిరి రాట వేసిన వానరసేన సభ్యులు

పాయకరావుపేట : పట్టణంలో గల మంగవరం రోడ్డు నందు వున్న శ్రీ సీతారామస్వామి ఆలయంలో గురువారం పందిరి రాట వేశారు. శ్రీరామనవమి సందర్భంగా రామాలయంలో పందిరి వేయుటకు లాంఛన ప్రాయంగా గురువారం పందిరిరాట వేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ, వానరసేన సభ్యులు, జగతా శ్రీనివాసరావు, మామిడి వెంకటేశ్వరరావు, బూడిద గౌరీశంకర్రావు, కొశిరెడ్డి నాగేశ్వరరావు, కొశిరెడ్డి నర్సింహమూర్తి, ఆలయ అర్చకులు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

జగనన్ననే మళ్లీ సీఎంగా చేసుకోవాలి



మునగపాకలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మునగపాక: రానున్న ఎన్నికల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. మునగపాకలో గురువారం రాత్రి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి. రమణమూర్తిరాజులను గెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే జగన్‌మోహన్‌రెడ్డి చలవేనన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, పార్టీ నేతలు ఆడారి కాశీబాబు, పిల్లి అప్పారావు, ఆడారి సంతోష్‌కుమార్ ప్రచారంలో పాల్గొన్నారు.

రెండో రోజూ పింఛన్లు...తప్పని పాట్లు

- వృద్ధులు, వికలాంగులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు
- అనారోగ్యంతో ఉన్న వారికి ఇంటి వద్దనే పంపిణీ

కోటవురట్ల: టీడీపీ అధినేత చంద్రబాబు పన్నిన కుట్రకు అవ్వా తాతలు, దివ్యాంగులు అవస్థలు పడుతున్నారు. అయినా ప్రభుత్వం చర్యలు తీసుకుని అందరికీ పింఛన్లు అందజేయడానికి సత్వర చర్యలు చేపట్టింది. అయితే చంద్రబాబు పన్నిన పన్నాగానికి వృద్ధులు మండుటెండలో సుదూరం నడుచుకు వెళ్లి పింఛను అందుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గత ఐదేళ్లలో ఎంతో ఆనందంగా పింఛను డబ్బులు తీసుకున్న వృద్ధులు ఇపుడు ప్రతిపక్షం కుట్రకు వేదన పడుతూ శాపనార్థాలు పెడుతున్నారు. ఓట్ల కోసం ఇంత కుట్ర చేస్తారా?..పేదలన్నా, వృద్ధులన్నా చంద్రబాబుకు అంత అలుసా అంటూ మండిపడుతున్నారు. ఏ ఓట్లకోసమైతే చంద్రబాబు ఇంత నీచానికి దిగజారాడో అదే ఓటుతో తగిన బుద్ధి చెప్పి మళ్లీ సీఎంగా జగన్‌నే తీసుకొచ్చుకుంటామని ఆవేశంగా చెబుతున్నారు. సచివాలయాలకు వచ్చే వృద్ధులు ఇబ్బంది పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ సిబ్బందికి సూచనలు ఇవ్వడంతో సంయమనంతో పింఛను డబ్బులు పంపిణీ చేస్తున్నారు. పలు సచివాలయాల పరిధిలో మంచానికే పరిమితమైన, నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుల వద్దకు సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛను నగదు అందిస్తున్నారు.

సచివాలయాల వద్ద క్యూ

ఎస్.రాయవరం : వలంటీర్ల ద్వారా ఇంటింటికీ తెచ్చి ఇచ్చే పింఛను నగదు ఈ నెల ఇంటికి రాదని తెలియడంతో గురువారం ఉదయాన్నే లబ్ధిదారులు సచివాలయ కేంద్రాలకు పరుగులు తీశారు. అధికారులు రాకముందే కార్యాలయాలకు వెళ్లి బారులు తీరారు. పింఛనుదారుల కోసం అధికారులు కుర్చీలు, టెంట్లు వేసినప్పటికీ వచ్చినవారికి సరిపడా లేక పలువురు క్యూలో నిల్చుని పింఛను అందుకున్నారు.



లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

గురువారం సాయంత్రానికి బట్వాడా అయిన పింఛన్ల వివరాలు

మండలం	ఏప్రిల్‌లో విడుదలైనవి	బట్వాడా జరిగినవి
నక్కపల్లి	12,417	9614
పాయకరావుపేట	13,242	9785
కోటవురట్ల	9685	7640
ఎస్‌రాయవరం	12,303	8792

కాగా మండలంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ద్వారా జరుగుతున్న పింఛన్లను మండల స్థాయి అధికారులు గురువారం పర్యవేక్షించారు. ఎంతమందికి విడుదలయ్యాయి. ఎంతమందికి ఏవిధంగా పంపిణీ చేస్తున్నారు. పంపిణీలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే వివరాలను తెలుసుకున్నారు.

రెండో రోజు పింఛన్ల పంపిణీ

మునగపాక: మండల వ్యాప్తంగా పింఛన్‌ల పంపిణీ రెండవ రోజైన గురువారం కూడా సచివాలయాల పరిధిలో ఉద్యోగుల ద్వారా జరిగింది. ఉదయం నుంచి పలువురు లబ్ధిదారులు సచివాలయాలకు చేరుకొని పింఛన్‌లను తీసుకున్నారు. సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి పింఛన్ కోసం వచ్చేవారికి సకాలంలో సేవలందిస్తున్నారు. అయితే కొంతదూరం మేర ఎండలో నడవాల్సి వస్తుందని పలువురు లబ్ధిదారులు వాపోయారు.



నక్కపల్లి సచివాలయం వద్దకు తోపుడు బండిపై పింఛను కోసం వస్తున్న వృద్ధురాలు

వలంటీర్ల ద్వారా ఇంటికే వచ్చి పింఛన్‌లు అందించేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు. మరో రెండు రోజుల పాటు సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తామని ఎంపీడీవో మన్మథరావు తెలిపారు. లబ్ధిదారులు ఆందోళన చెందనక్కరలేదన్నారు.

కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ

నక్కపల్లి : రెండో రోజు కూడా పింఛను సొమ్ము కోసం వృద్ధులంతా మండు టెండలో సచివాలయాలకు అనేక ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఎంచక్కా వలంటీరు ఇంటికి తెచ్చి పింఛను ఇచ్చేవాడు, చంద్రబాబు పుణ్యమా అని మళ్లీ ఐదేళ్ల తర్వాత ఇలా పంచాయతీల చుట్టూ తిరగాల్సి వస్తోందని, మమ్మల్ని ఇక్కట్లు పెట్టి చంద్రబాబుకు ఏం కలిసొస్తుందో అంటూ పలువురు శాపనార్థాలు పెట్టారు. అయితే వలంటీర్ల ద్వారా పింఛను పంపిణీని అడ్డుకోవడంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సాయంతో అవ్వాతాతలకు, దివ్యాంగులకు, వితంతువులకు పింఛన్లు బటాడా చేసే ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమయింది. అయితే బ్యాంకుల నుంచి డబ్బులు డ్రాచేసి, ఎంపీడీవో నుంచి అధీకృత లెటర్‌ను తీసుకుని రోడ్డుపై ఎన్నికల సంఘం వారు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో సమాధానం చెప్పుకుంటూ గ్రామాలకు చేరే సరికి సాయంత్రం అయింది. దీంతో బుధవారం కొన్ని గ్రామాల్లో కొద్ది మందికి మాత్రమే పింఛన్లు పంపిణీ చేసిన సిబ్బంది గురువారం కూడా పింఛన్ల పంపిణీ కొనసాగించారు. మరీ లేవలేని స్థితిలో ఉన్నవారికి, మంచాన పడ్డవారికి సచివాలయ సిబ్బంది ఇళ్లకు తీసుకెళ్లి పింఛన్లు అందజేశారు.



కోటవురట్ల: కదల్లేని స్థితిలో ఉన్న వృద్ధుడు రామునాయుడుకు పింఛను నగదు పంపిణీ



కొరుప్రోలు సచివాలయంలో పింఛను తీసుకునేందుకు క్యూకట్టిన అవ్వాతాతలు

రాంబిల్లి : ఎన్నికల సంఘం ఆదేశాలతో వాలంటీర్ల ద్వారా పంపిణీ నిలిచిపోయింది. దీంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో పింఛన్లు బట్వాడా చేస్తోంది. గురువారం కూడా దివ్యాంగులు, వృద్ధులు కష్టాలు పడుతూ సచివాలయాలకు పింఛన్ల కోసం వచ్చారు. వారందరికీ పింఛన్లు అందజేశారు.

మరొకరి సాయం లేనిదే వెళ్లలేను...



నేను మరొకరి సహాయం ఉన్నప్పుడే బయటకు వెళ్లగలను. నాకు పింఛను నగదు ప్రతి నెలా ఇంటికి ఇచ్చేవారు. ఈ నెల వలంటీర్లను ఆపివేయడం వల్ల ఇంటికి ఇవ్వలేదు. సచివాలయంలో ఇస్తున్నారని తెలిసి పాకుకుంటూ వచ్చాను. ఎక్కువ మంది ఉండడంతో అరగంట పాటు వేచి చూసి పింఛను తీసుకున్నాను.

–నిమ్మలపూడి శ్రీనివాసరావు, దివ్యాంగుడు, కొరుప్రోలు

వలంటీర్లను కొనసాగించాలి



ఒకటో తేదీ దాటిపోయినా మా లాంటి దివ్యాంగులకు ఎవరు పెన్షన్ ఇస్తారన్నదీ తెలియలేదు. దివ్యాంగుల బండిపై సచివాలయ కేంద్రానికి వచ్చాను. అధికారులు 9 గంటల నుంచి నగదు ఇవ్వడం మొదలు పెట్టారు. మా లాంటివారి ఇంటికి తెచ్చి ఇస్తామని చెబుతున్నారు. రెండు రోజులుగా కార్యాలయానికి వచ్చినా సమాధానం చెప్పిన వారు లేరు. ఇంటింటికీ వచ్చి పెన్షన్ నగదు ఇచ్చేవారిని ఎందుకు ఆపేశారో తెలియదు. వెంటనే మునుపటిలా వలంటీర్ల ద్వారా పింఛను ఇవ్వాలి.

– అండిబోయిన వెంకటరమణ, దివ్యాంగుడు, గుర్రాజుపేట.

చంద్రబాబు కుతంత్రాల వల్లే వృద్ధులకు అవస్థలు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : రాష్ట్రంలో అవ్వాతాతలపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుతంత్రాల కారణంగా పింఛన్ తీసుకునేందుకు అవస్థలు పడడం విచారకమని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందకుండా చంద్రబాబు అండ్ కో ప్రవర్తిస్తున్న తీరు బాధారమన్నారు. వలంటీర్ల ద్వారానే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అటువంటి సేవలందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబు మొదటి నుంచి అక్కసు వెళ్లగక్కుతున్నారని గుర్తు చేశారు. మునగపాకలోని బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు ఇతర ప్రతిపక్ష పార్టీల తప్పుడు చేష్టలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటికే ప్రజలు చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతి కుటుంబానికి మేలు జరిగేలా వలంటీర్ వ్యవస్థను దేశంలోనే ఎక్కడాలేని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారన్నారు. వలంటీర్ వ్యవస్థ వచ్చాకే రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి వలంటీర్ వ్యవస్థ ద్వారా మంచి పేరువస్తుందనే అక్కసుతో కుతంత్రాలకు తెరలేపారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని అలాగే జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం తథ్యమన్నారు. సమావేశంలో పార్టీ నేతలు దాసరి అప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ, దొడ్డి బుజ్జి, మద్దాల వీరునాయుడు,లంబా అప్పారావు, బొడ్డేడ శ్రీనివాసరావు, శరగడం జగన్నాథరావు, మొల్లేటి శంకర్,పరమేష్, నరేంద్ర పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు దిట్ట

ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు

నక్కపల్లి : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడికి అధికార యావ తప్ప అభివృద్ధి ధ్యాస లేదని రాజాం ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. గురువారం ఆయన వెదుళ్లపాలెం, వేంపాడు, కాగిత గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు 2014 ఎన్నికల్లో బూటకపు హామీలు ఇచ్చి నెరవేర్చలేదన్నారు. రుణమాఫీ చేస్తానని చెప్పి మాఫీ చేయకపోతే ఆడపడుచులంతా బ్యాంకుల్లో తెచ్చి అప్పు కట్టడానికి పుస్తెలతాళ్లు అమ్మి అప్పు తీర్చారన్నారు. రైతు రుణమాఫీ విషయంలో కూడా ఇదే విధంగా చంద్రబాబు మోసం చేసాడన్నారు. 2019లో కూడా ఇవే హామీలు ఇస్తే ప్రజలు నమ్మలేదన్నారు. కానీ జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాడన్నారు. బ్రోకర్ల ప్రమేయం లేకుండా ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేశారని, అవ్వాతాతలకు వలంటీర్ల ద్వారా ఐదేళ్ల పాటు నిరాటంకంగా పింఛన్లు ఇంటి వద్దే ఇచ్చారని అన్నారు. దీన్ని జీర్ణించుకోలేక చంద్రబాబు వలంటీర్లను అడ్డుకుని వృద్ధులకు పింఛన్లు అందకుండా అవస్థలకు గురిచేశాడన్నారు. వాళ్ల ఉసురు చంద్రబాబుకు తప్పక తగులుతుందన్నారు. సంక్షేమాన్ని కూడా రాజకీయం చేసి వ్యవస్థలను మేనేజ్ చేసి అడ్డుకునే దుర్మార్గుడు చంద్రబాబు అన్నారు. తన హయాంలో జన్మభూమి కమిటీలకు రాష్ట్ర సంపదను దోచిపెట్టాడన్నారు.



వేంపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కంబాల జోగులు

రెండేళ్ల నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, నాయకులు ప్రజల్లోనే ఉండి ప్రభుత్వ పథకాలు సక్రమంగా పేదలకు అందుతున్నాయో లేదో తెలుసుకోవడం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీగా బూడి ముత్యాల నాయుడిని గెలిపించి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీరం నర్సింహమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షులు మణిరాజు, పాపారావు, తాతబాబు, సర్పంచ్‌లు వెదుళ్లరమణ, పోతంశెట్టి రాజేష్, ఏడిద నూకరత్నం, సురేష్‌వర్మ, ఎంపీటీసీలు లొడగల చంద్రరావు, బచ్చలరాజు, గొర్లగోవిందు, పార్టీ సీనియర్ నాయకులు సురేష్ రాజు, సూరాకాసుల గోవిందు, పోతంశెట్టి బ



వెదుళ్లపాలెంలో ప్రచారం చేస్తున్న అభ్యర్థి జోగులు, నాయకులు

అమ్మా పెన్షన్ అందుకున్నావా...

ఎస్.రాయవరం : అమ్మా పెన్షన్ అందుకున్నావా.. అంటూ పలువురు అవ్వాతాతలను పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు పలకరించారు. గుర్రాజుపేట పర్యటనకు విచ్చేసిన ఎమ్మెల్యే గ్రామస్తులతో మాట్లాడారు. ప్రతిపక్షాల కుట్ర కారణంగా వలంటీర్లను ఆపివేయడంతో పింఛను పంపిణీలో జాప్యం జరిగిందని, అయినా అందరికీ పింఛను పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని వారికి తెలిపారు. అయిదేళ్లుగా జరిగే కార్యక్రమం ఎన్నికల్లో అడ్డుకోవడం ప్రతి పక్షాలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. మళ్లీ 38 రోజుల్లో జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారని, ఇబ్బంది లేకుండా సంక్షేమ పథకాలు,పెన్షన్లు ఇంటి వద్దకే వస్తాయని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్ రత్నం, దాట్ల శ్రీరామరాజు,మధువర్మ, కోరా జగదీష్,కోరెడ్డి సుబ్బారావు,లక్కోజు ఆదిమూర్తి తదితరులు ఉన్నారు.

వైభవంగా దుర్గా మల్లేశ్వర ఆలయ ప్రారంభోత్సవం



దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కోటవురట్ల : తంగేడులో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయాన్ని గురువారం వైభవంగా ప్రారంభించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలతో సర్వాంగసుందరంగా అలంకరించగా ఆధ్యాత్మికను శోభను సంతరించుకుంది. తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మికత పెంపొందించాలి

ఎస్.రాయవరం : గ్రామాల్లో గ్రామ దేవతలకు దేవాలయాలు నిర్మాణాలు చేసి ఆధ్యాత్మిక భావన పెంపొందించాల్సిన అవసరం ఎంతగానో ఉందని పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గుర్రాజుపేట గ్రామంలో నూతనంగా నిర్మాణం చేసి, విగ్రహ ప్రతిష్ఠ చేసి నూకాంబిక అమ్మవారి ఆలయం ప్రారంభోత్సవ వేడుకలో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన ప్రసాద, అల్పాహారాన్ని ఎమ్మెల్యే స్వయంగా భక్తులకు వడ్డించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకట సర్పంచ్ రత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు దాట్ల శ్రీరామరాజు, మధురాజు,కోరా జగదీష్, కోరెడ్డి సుబ్బారావు,లక్కోజు ఆదిమూర్తి,యల్లపు నాగు, కొర్ని రాజారమేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.




భక్తులకు ప్రసాదం పంచుతున్న ఎమ్మెల్యే

పీఏసీఎస్ ఆఫీస్ అసిస్టెంట్ సస్పెన్షన్

రోలుగుంట: స్థానిక పీఏసీఎస్‌లో పనిచేస్తున్న ఆఫీస్ అసిస్టెంట్ పిల్లా నూకరాజు గత నెల 31న ఓ రాజకీయ సమావేశంలో పాల్గొన్నారని అభియోగం మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు గురువారం క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. కొవ్వూరుకు చెందిన బంటు రాజు జిల్లా సహకార అధికారి ప్రేమ స్వరూపారాణికి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆమె సదరు ఉద్యోగి నుంచి ఆ రోజే వివరణ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో సస్పెన్షన్ ఉత్తర్వులు యలమంచిలి డివిజన్ సహకార కార్యాలయాధికారి కిరణ్‌కుమారి గురువారం నూకరాజు అందజేశారు.

జోరుగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారం సాగిస్తున్న నాయకులు

పాయకరావుపేట : మండలంలో గల 24 గ్రామాల్లోను ఆయా గ్రామాల బూత్ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్ళి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు, అమలు చేస్తున్న విధానం పై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. మే 13 న జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గుర్తుకి ఓటు వేయాలని, అభ్యర్థి కంబాల జోగుల్ని గెలిపించాలని ప్రచారం సాగిస్తున్నారు. ఫ్యాన్ గుర్తు వున్న బ్రోచర్లను, స్టిక్కర్లను పంపిణీ చేస్తున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, అన్నవరం దేవస్థానం డైరెక్టర్ దోమాడ సుందర్రావు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, పంచాయితీ వార్డు సభ్యులు ధనిశెట్టి మహేష్ పాల్గొన్నారు.

8న నూకాంబిక అమ్మవారి పండగ

మునగపాక : స్థానిక బైపాస్ రోడ్డులోని నూకాంబిక అమ్మవారి ఆలయం ప్రాంగణంలో పండగ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆమె గురువారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ కొత్త అమావాస్య జాతరలో భాగంగా ఈ నెల 7వ తేదీ రాత్రి అమ్మవారి ఘటాల ఊరేగింపు జరుగుతుందన్నారు. 8వ తేదీన అమ్మవారి పండగ సందర్భంగా పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే 9వ తేదీన కూడా ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆమె కోరారు. ఆలయ చైర్మన్ మళ్ల రామజగన్నాథం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉత్సకమిటీ చైర్మన్ వేగి కృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, వైఎస్సార్‌సీపీ నేతలు ఆడారి కాశీబాబు, పిల్లి అప్పారావు, పెంటకోట శ్రీనివాసరావు, బొడ్డేడ సోమరాజు, సచివాలయ కన్వీనర్ బొడ్డేడ మహేష్ పాల్గొన్నారు.



నూకాంబిక అమ్మవారి పండగ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

ఉదయం పది వరకే ఉపాధి పనులు

మాకవరపాలెం: అధిక ఎండల నేపథ్యంలో ఉదయం 10 గంటల వరకే ఉపాధి పనులు నిర్వహించాలని ఎంపీడీవో చంద్రరావు ఆదేశించారు. కొండలఅగ్రహారంలో పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కావడంతో కూలీలు పది గంటలతో పని ముగించాలని తెలిపారు.

మాడుగుల రూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీవో పి. ఈశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం వేసవి ఎండల నేపథ్యంలో ఉదయం ఐదు కల్లా ఉపాధి పనులు ప్రారంభించి పది గంటల లోపు పూర్తి చేయాలన్నారు. పని ప్రదేశానికి తాగునీరు తీసుకెళ్లాలన్నారు.

ఉపాధి పనుల్లో వడదెబ్బ తగలకుండా చర్యలు



ఉపాధి కూలీలకు సూచనలు ఇస్తున్న ఏపీవో గంగునాయుడు

కోటవురట్ల : ఉపాధి పనుల్లో కూలీలు వడదెబ్బ బారిన పడకుండా చర్యలు తీసుకున్నట్టు ఏపీవో గంగునాయుడు తెలిపారు. రామన్నపాలెం రెవెన్యూ పరిధిలో గురువారం జరిగిన ఉపాధి పనుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఏపీవో మాట్లాడుతూ ఉపాధి పనులు జరిగే ప్రదేశాలలో చలువ పందిళ్లు వేయించి తాగునీరు, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు.

గ్రామాల్లో నూకాలమ్మ తల్లి జాతర సందడి



దిమిలిలో నూకాలమ్మ తల్లి ఘటం ఊరేగింపు

రాంబిల్లి : గ్రామాల్లో నూకాంబిక అమ్మవారి జాతర సందడి నెలకొంది. గురువారం దిమిలి సహా పలు గ్రామాల్లో జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఘటాలను పుర వీధుల్లో ఊరేగించారు. ఈ నెల 8న కొత్త అమావాస్య సందర్భంగా నూకాలమ్మ తల్లి జాతరను నిర్వహించనున్నారు. అప్పటివరకు ప్రతి రోజు అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగిస్తారు. భక్తులు అమ్మవారి ఘటాన్ని దర్శించుకొని పూజలు చేస్తున్నారు.